

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.169	245	279
సూర్యాపేట	రూ.165	240	270
నల్లగొండ	రూ.166	252	286

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5 । కనిష్ఠం 24.2



అడ్డాలు మారుస్తూ అందరినీ ఏమార్చుతూ

- ఉమ్మడి జిల్లాలో జోరుగా పేకాట శిబిరాలు
- చేతులు మారుతున్న కోట్ల రూపాయలు
- పోలీసులు, రాజకీయ నాయకుల అండదండతోనే!

నల్లగొండ,మే 18 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పేకాట శిబిరాల నిర్వహణ జోరుగా సాగుతోంది. మాఫియా స్థాయిలో తయారైన నిర్వాహకులు పోలీసుల్లో కొందరిని మచ్చిక చేసుకొని, మరికొందరిని ఏమార్చుతూ పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. పట్టుబడకుండా చాకచక్యంగా అడ్డాలు మారుస్తూ ఆట సాగిస్తున్నారు. పక్కా నిఘాతో వీరిఆట కట్టించాల్సిన పోలీసు నిఘావర్గాలు, ఉన్నతాధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం వీరికి కలిసొస్తుంది.ఒక్కోరాత్రికి ఒక్కో చోట పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ కోట్ల రూపాయలు చేతులు మారుతూ సాగుతున్న ఈ జూదంలో కొందరి జీవితాలు తలకిందులు అవుతున్నాయి. సాగర్, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, రాయచూరు ప్రాంతాలకుచెందిన కొందరు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జాతీయ రహదారుల సమీప గ్రామాల్లోని తోటలు, దాబా హోటళ్ల సమీపంలో పేకాట శిబిరాలు కొనసాగిస్తున్నట్టు సమాచారం. వారికి పోలీసులు, రాజకీయ నాయకులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రహస్యంగా స్థావరాలు

స్థావరం పేరును జూదరులకు వాట్సప్ ద్వారా నిర్వాహకులు సమాచారమందిస్తున్నారు. 20 మంది వరకు ఆడేందుకు సుముఖత వ్యక్తం చేస్తే, ఆ రోజు ఏ ప్రాంతంలో ఆటకు అనుకూలమైన పరిస్థితి ఉంటుందో, పోలీసుల నుంచి ఇతరవర్గాల నుంచి సహకారం తీసుకొని వాట్సప్‌లలో మెస్సేజ్‌లు పెడుతున్నారు. పేకాట ఆడదల్చుకున్న వ్యక్తుల నుంచి కనీసం రూ.50వేల వరకు ముందుగానే నిర్వాహకులు డిపాజిట్ చేయించుకుంటారు. ఆ తర్వాత వారందరినీ కామన్ పాయింట్ వద్దకు రప్పించి అక్కడి నుంచి పేకాట నిర్వాహకులే సమకూర్చే ప్రత్యేకవాహనాల్లో శిబిరాలకు తరలిస్తారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల్లోపు శిబిరాల వద్దకు జూదరులను తరలించి మరునాడు తెల్లవారు జాము వరకు ఆటలు ఆడిస్తారు. తిరిగి తెల్లవారుజాముున ఆట ముగించి ఎక్కడి వారిని అక్కడికి పంపిస్తారు. నగదును ఫోన్‌పే, గూగుల్‌పేతో పాటు మనీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఒక్క రాత్రిలో ఒక్కో శిబిరంలో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయని సమాచారం. మొత్తం ఆటల్లో 3నుంచి 5శాతం నిర్వాహకులు కమీషన్ తీసుకుంటున్నారు. ఒక్క రాత్రి శిబిరం నిర్వహిస్తే రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు వస్తోందని, అందులో పోలీసులకు, స్థానికంగా సహకరించిన వారికి సగం వరకు ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని నిర్వాహకులు జేబులో వేసుకుంటున్నట్లు తెలిసింది. ఒక ప్రాంతం వద్ద ఒక రాత్రి శిబిరం నిర్వహిస్తే, మళ్లీ మరునాడు ఇంకో ప్రాంతానికి శిబిరాన్ని మారుస్తున్నారని, దీంతో నిఘావర్గాలకు సమాచారం అందకుండా జాగ్రత్త పడుతున్నారని సమాచారం. ఇటీవల ఒక నిర్వాహక బృందం తొలుత హుజూర్‌నగర్-మిర్యాలగూడ మధ్యలో ఉన్న ఓ తోటలో రాత్రంతా శిబిరం నిర్వహించిందని, విషయం గ్రామస్థులకు తెలిసి మళ్లీ నిర్వహిస్తే పోలీసులకు సమాచారమిచ్చేందుకు సిద్ధమవగా, ఆ తర్వాత వారానికి కొండమల్లేపల్లి వద్ద ఒక గిరిజనతండా సమీపంలో తోటలో శిబిరం నిర్వహించారని తెలిసింది. సాగర్-మల్లేపల్లి-ఇబ్రహీంపట్నం మార్గంలో ఏదో ఒక చోట నిత్యం ఈ శిబిరం ఒక్కటైనా కొనసాగుతోందని, అంతా బడాబాబులు, వ్యాపారులు ఈ స్థావరాలకు వచ్చి లక్షలాది రూపాయలు పోగొట్టుకొని వెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇంత విచ్చలవిడిగా పేకాట సాగుతున్నా పోలీసులు, రాజకీయనాయకుల అండదండలుండడంతో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయని పేర్కొంటున్నారు. పేకాట శిబిరాలపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని, వీటి నిర్వహణను కట్టడిచేయాలని కోరుతున్నారు.

అడ్డాలు మారుస్తూ..

మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కొండమల్లేపల్లి, నాగార్జునసాగర్ ప్రాంతాలకు చెందిన కొందరు పేకాట శిబిరాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. పోలీస్‌శాఖలో కీలకమైన స్టేషన్లలో, ముఖ్య అధికారుల వద్ద, ముఖ్యమైన విభాగాల్లో దీర్ఘకాలంగా పాతుకుపోయిన ఉద్యోగులు, కానిస్టేబుళ్ల సహకారంతో వీరు స్థావరాలు నిర్వహించే పరిధిలోని స్టేషన్ అధికారులను మచ్చికచేసుకుంటున్నారు. ఒక్కో రోజు ఒక్కో స్థావరం ఏర్పాటుచేసుకొని, రూ.కోటినుంచి రూ.2కోట్లు, రూ.3కోట్లవరకు పందేలు నడుస్తాయని, ఈ ఆటల్లో నిర్వాహకులకు 3 నుంచి 5 శాతం వరకు కమీషన్ ముడుతోందని సమాచారం. ఈ కమీషన్లలో స్థావరాల నిర్వహణకు తోడ్పడ్డ పోలీసులు, ఇతరులకు కొంత ముట్టజెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏపీ రాష్ట్రంలోని కృష్ణా, పల్నాడు జిల్లాలతో పాటు కర్ణాటకలోని రాయచూరు, తెలంగాణలోని ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు చెందిన వందలాది మంది పేకాటరాయుళ్లతో టచ్‌లో ఉండే ఈ నిర్వాహకులు భారీ ఎత్తున శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిసింది.

హుజూర్‌నగర్-కోదాడ, కోదాడ-ఖమ్మం, హుజూర్‌నగర్-మిర్యాలగూడ, నాగార్జునసాగర్-పెద్దవూర-కొండమల్లేపల్లి-మాల్, దేవరకొండ పరిసర మార్గాల్లో తోటలు, ఫాంహౌస్‌లు, దాబాహోటళ్లు అడ్డాగా వీరు పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు.



కర్షకులు పారాహుషార్

ప్రతీ వానాకాలంలో నాసిరకం, నకిలీ విత్తనాల బెడద రైతులకు పెను సవాల్‌గా మారింది. అసలు ఏదో, నకిలీ ఏదో గుర్తించలేని విధంగా విత్తనాలు మార్కెట్‌లో లభిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. ప్రధానంగా వరి, పత్తి విత్తనాలు నకిలీవి వస్తుండటంతో తీరా పంట సాగుచేశాక దిగుబడి రాక రైతులు ఆర్థికంగా దెబ్బతింటున్నారు. సాగుచేసిన వరిలో తెగుళ్లు, తాలు, నాణ్యత లేక పంట చేతికి వచ్చాక రైతులు గగ్గోలు పెడుతున్నారు.

– నల్లగొండ

- ప్రతీ సీజన్‌లో నకిలీ విత్తనాల బెడద
- ఏపీ రాష్ట్ర సరిహద్దు జిల్లాల నుంచి విత్తనాలు
- ఉమ్మడి జిల్లాకు భూత్‌పూర్ నుంచి దళారుల రాకపోకలు
- గతంలో పీడీయాక్టులు సైతం అమలు

వరి, పత్తి విత్తనాల విషయంలో మధ్య దళారులదే పెత్తనమైంది. గ్రామీణ ప్రాంతాల్లో దళారులు రైతులను మచ్చిక చేసుకుని తక్కువ ధర, అధిక దిగుబడులు, తక్కువ సమయంలో పంట చేతికి వస్తుందని నమ్మించి రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నా, దళారుల దందాను నిలువరించలేకపోతున్నారు. రెండు రోజుల క్రితం నల్లగొండ జిల్లా వ్యవసాయశాఖ అధికారులు మునుగోడు నియోజకవర్గంలోని చండూరు, మర్రిగూడ మండలాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గత సంవత్సరం ఏకంగా పీడీయాక్టును సైతం అమలు చేశారు. గతంలో నల్లగొండ జిల్లా లో నాసిరకం లూజు పత్తి విత్తనాలు పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్న ఘటనలు ఉన్నాయి.

ఈ నెల చివరి వారంలో సీజన్ ప్రారంభం

ఈ నెల నాలుగో వారంనుంచి వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలకు రైతులు దుక్కులు దున్నారు. గతానికి భిన్నంగా ఈసారి మేలో మొస్తరు నుంచి భారీ వర్షాలు అడపదడపా కురుస్తున్నాయి. ఈ నెలాఖరులోనే రోహిణీ కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు పెద్ద మొత్తంలో పత్తి విత్తనాలు విత్తే అవకాశాలు ఉన్నాయి. ముందుగానే వర్షాలు కురుస్తుండటంతో రైతులు విత్తనాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరితో పాటు పత్తి, ఇతర పంటలు 21.50లక్షల ఎకరాల్లో సాగుకానున్నాయి. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 5.40లక్షల ఎకరాల్లో పత్తి సాగుకానుండగా, అందుకు 15లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం. యాదాద్రి, సూర్యాపేట జిల్లాలో వరి అత్యధికంగా సాగు కానుండగా పత్తి సుమారు 3లక్షల మేర సాగు కానుంది. ఈ రెండు జిల్లాల్లో సుమారు 9లక్షలకు పైగా పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం. వరి విత్తనాలు సుమారు 2.4 లక్షల క్వింటాళ్లకు పైగా అవసరం. అయితే పత్తి ప్యాకెట్లు 450గ్రాముల ధర రూ.864గా ఉంది. గత ఏడాది ధర రూ.853 ఉండగా, ఒక శాతం పెరిగింది.

భూత్‌పూర్, మాచర్ల నుంచి నకిలీ విత్తనాలు

శాన్‌శాంటోను కంపెనీకి చెంది బీటీ-3 రకం విత్తనాలపై దేశంలో నిషేధం ఉంది. ఈ విత్తనాలతో కాలుష్యంతోపాటు పలు రకాలుగా నష్టాలు ఉన్నాయని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వీటిని నిషేధించింది. మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా పత్తి జిన్నింగ్ మిల్లులు ఉండటంతో అక్కడ విత్తనోత్పత్తి సులువుగా జరుగుతోంది. ఆ జిల్లాలోని భూత్‌పూర్ నుంచి వచ్చే దళారులు బీటీ-2 రకం విత్తనాలను బీటీ-3 రకంగా రైతులకు అంటగడుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి వచ్చింది. కొంతమంది దళారులు ఉమ్మడి జిల్లాల నుంచి పత్తి రైతులను భూత్‌పూర్‌కు తీసుకెళ్లి అక్కడ నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. డిస్కౌంట్, రవాణా, భోజనాల ఖర్చులు ఇచ్చి రైతులను మభ్యపెట్టి వారికి విత్తనాలను విక్రయిస్తున్నారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల నుంచి సైతం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నకిలీ బీటీ-3 రకం విత్తనాలు వస్తున్నాయి. నాగార్జునసాగర్ సరిహద్దులోనే మాచర్ల ఉండటంతో సులువుగా వివిధ మార్గాల్లో నకిలీ పత్తి విత్తనాలు చేరుతున్నాయి. రైతులు పత్తి, వరి విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే వారికి డీలర్లు, వ్యాపారులు బిల్లు ఇవ్వాలి. కానీ, చాలా చోట్ల రశీదు ఇవ్వడం లేదు. పంట దిగుబడులు తక్కువగా వచ్చినపుడు రైతులు నిలదీస్తారన్నా భయంతో వ్యాపారులు బిల్లులు ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఏపీ నుంచేగాక మహారాష్ట్ర, కర్నాటక, ఛత్తీస్‌ఘడ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి కూడా ఉమ్మడి జిల్లాలకు నకిలీ విత్తనాలు రైళ్లలో చేరుతున్నాయి. ఒరిజినల్ కంపెనీలకు చెందిన ప్యాకెట్ల మాదిరిగానే నకిలీ విత్తనాల ప్యాకెట్లు తయారవుతున్నాయి. ఇటీవల వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి అనుమానం వచ్చిన వరితో పాటు పత్తి విత్తనాల నమునాలను రాజేంద్రనగర్ ల్యాబ్‌కు పంపించారు. అక్కడ నుంచి నివేదిక వచ్చాకే విత్తనాలు విక్రయించాలని వ్యాపారులను ఆదేశించారు.

విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం



విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ప్రతీ రైతు అప్రమత్తంగా ఉండాలి. మాచర్ల, భూత్‌పూర్‌తో పాటు కొన్ని ప్రాంతాల నుంచి వచ్చే దళారులు బీటీ-2 విత్తనాల పేరుతో బీటీ-3 విత్తనాలను అంటగట్టే ప్రమాదం ఉంది. పూర్తిస్థాయి అనుమతులు ఉన్న డీలర్లు, వ్యాపారుల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేసి రశీదులు తీసుకోవాలి. ఇటీవల మేం 400 రకాల విత్తన నమూనాలు సేకరించాం. నాణ్యత ఉన్న విత్తనాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నాం. దళారుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో విత్తనాలు కొనుగోలు చేయవద్దు. నకిలీ విత్తనాలు ఉన్నట్లు దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయిస్తే చట్టపర చర్యలు తీసుకుంటాం.

– పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

పెరిగిన విత్తనాలు, ఎరువుల ధరలు

- పత్తి విత్తనాలపై రూ.11, వరి విత్తనాలపై రూ.50 పెంపు
- రూ.100 పెరిగిన ఎరువుల ధర

మోత్కూరు,మే 18: రైతులు పండించిన పంట దిగుబడుల ధరలు పెరగకున్నా ఏటా విత్తనాలు, ఎరువుల ధరలు మాత్రం పెరుగుతున్నాయి. పత్తి విత్తనాల ధర ప్యాకెట్‌పై రూ.11 పెరిగింది. వరి విత్తనాలు, ఎరువుల ధరలు కూడా పెరిగాయి.

నాలుగేళ్లుగా పెరుగుతున్న ధర

పత్తివిత్తనాలు 2020లో ప్యాకెట్(450గ్రాముల)ధర రూ.730 ఉండగా, 2021లో రూ.37 పెంచి ధర రూ.767 చేశారు. 2022లో రూ.43పెంచి ప్యాకెట్ ధర రూ.810 చేశారు. 2023లో రూ.43పెంచగా ప్యాకెట్ ధర రూ.853 అయ్యింది. ప్రస్తుతం రూ.11 ధర పెంచి రూ.864 చేశారు. వరి విత్తనాలపై ధర రూ.50 పెరిగింది. గతంలో 1010 వరి విత్తనాలు బస్తా (30 కిలోలు) రూ.950 ఉండగా, ప్రస్తుతం రూ.1,000కి విక్రయిస్తున్నారు.

ఎరువుల ధరలు సైతం

గత యాసంగి సీజన్‌తో పోల్చుకుంటే కొన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు బస్తాకు రూ.100పెరిగాయి. 28-28-0, 14-35-14 కాంప్లెక్స్‌బస్తాల ధర గతవానాకాలం సీజన్‌లో రూ.1,500ఉండగా, యాసంగిలో రూ.1,600, ప్రస్తుతం రూ.1,700 ఉంది.

రైతులపై రూ.18.87కోట్ల అదనపు భారం

యాదాద్రి జిల్లాలో 1.20లక్షల ఎకరాల్లో, నల్లగొండ జిల్లాలో 6.30లక్షల ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో లక్ష ఎకరాల్లో, మొత్తం ఉమ్మడి జిల్లాలో 8.50ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా. ఎకరాకు రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం. కనీసం రెండు బస్తాల కాంప్లెక్స్ ఎరువులు వేస్తారు.పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.11 పెరిగినందున ఎకరాకు రెండు ప్యాకెట్లకు రూ.22, రెండుబస్తాల ఎరువుకు రూ.200 చొప్పున ఎకరాకు అదనంగా రూ.222 ఖర్చవుతుంది.ఇలా ఉమ్మడి నల్లగొండ జిల్లా పత్తి రైతులపై రూ.18.87 కోట్ల అదనపు భారం పడుతోంది.

స్టాక్ రావడం లేదంటున్న డీలర్లు

విత్తనాల ధర పెంచడమేగాక కంపెనీలు సరఫరా తగ్గించినట్టు డీలర్లు చెబుతున్నారు. విత్తనాల సరఫరా తక్కువగా ఉంటే ధర పెంచే ప్రమాదం ఉంది. గతంలో రూ.1లక్ష చెల్లిస్తే రూ.2లక్షల విలువైన విత్తనాలు క్రెడిట్(ఉద్దెర) ఇచ్చేవారని, వాటిని విక్రయించాక డబ్బు చెల్లించేవారమని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం చెల్లించిన డబ్బుకు సరిపడా విత్తనాలే ఇస్తున్నారని పేర్కొంటున్నారు. కొన్ని విత్తనాలను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పత్తి సాగు గిట్టుబాటు కావడం లేదు



సొంత భూమి 10 ఎకరాలతోపాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తం 25 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. రెండేళ్లుగా వాతావరణం అనుకూలించక ఆశించిన దిగుబడి రాలేదు. గత ఏడాది పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.7020కి విక్రయించా. పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తనాలు, ఎరువుల ధర పెంచడం మాపై మరింత భారం మోపడమే. ప్రభుత్వం ధరలు పెరగకుండా అదుపు చేయాలి లేదా పెరిగిన ధరకనుగుణంగా మద్దతు ధర పెంచాలి.

– దబ్బెటి శ్రీను, పత్తి రైతు, మోత్కూరు

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్



చౌటుప్పల్‌లో వైద్య సిబ్బందితో వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

చౌటుప్పల్ టౌన్, మే 18: వానాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడే రోగులకు మెరుగైన వైద్య సేవలనందించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ ఆదేశించారు. చౌటుప్పల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో శనివారం జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న చౌటుప్పల్, భువనగిరి, రామన్నపేట, ఆలేరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్లు కె.అలివేలు, స్వప్న, వీరన్న, రాజగోపాల్‌తో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. సీహెచ్‌సీల పనితీరు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై కమిషనర్ సమీక్షించారు. వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోగులకు సోకే సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. చౌటుప్పల్ సీహెచ్‌సీలోని వార్డులలో తిరిగి వైద్యసేవలపట్ల రోగులతో కమిషనర్ మాట్లాడి సంతృప్తి వ్యక్తంచేశారు. సూపరింటెండెంట్ అలివేలును కమిషనర్ అభినందించారు. సమీక్షలో డీసీహెచ్ఎస్ చిన్నా నాయక్ పాల్గొన్నారు. అదేవిధంగా 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మే 18: వచ్చే నెల 9న గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా పరీక్ష నిర్వహణకు అన్ని చేపట్టాలన్నారు. పరీక్షల నిర్వహణకు ప్రతీ జిల్లాకు ఒక రీజినల్ కో ఆర్డినేటర్‌ను నియమించినట్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రీజినల్ కో ఆర్డినేటర్ జాయింట్ కస్టోడియన్‌గా ఉంటారని, వీరికి పోలీస్ నోడల్ అధికారి సహకరిస్తారన్నారు. ప్రతీ కేంద్రానికి ఒక డీవో (డిపార్ట్‌మెంట్ ఆఫీసర్)ను నియమించాలని, తహసీల్దారు స్థాయి అధికారిని ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ప్రతీ వంద మంది అభ్యర్థులకు ఒక ఐడెంటిఫికేషన్ అధికారి, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్ వస్తువులు, గాడ్జెట్స్, సెల్‌ఫోన్లు వెంట తీసుకెళ్లకుండా తనిఖీ చేపట్టాలన్నారు. పరీక్ష రోజున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, అత్యవసర సేవల కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంతోపాటు కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, నిబంధనల మేరకు పోలీస్ బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల సమీపంలో జీరాక్స్‌కేంద్రాలను మూసివేయించాలని, ఇతర ప్రాంతాల నుంచి కేంద్రాలకు తరలివచ్చే అభ్యర్థులకోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, పరీక్షకు రెండు రోజుల ముందే కేంద్రాల్లో పరిశుభ్రంగా పారిశుధ్య పనులు నిర్వహించడంతో పాటు తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్‌రూం కోసం పటిష్ఠ భద్రతతోపాటు రవాణా ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని, రీజినల్ కో-ఆర్డినేటర్, కేంద్రం పరిశీలకులు, డీవో, పోలీస్ నోడల్ అధికారులకు ఈ నెల 22న హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలోని యూజీసీ ఆడిటోరియంలో బయోమెట్రిక్ విధానంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బయోమెట్రిక్ నేపథ్యంలో అభ్యర్థులు ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు కేంద్రంలోకి అనుమతి ఉండగా ఆ తర్వాత నిమిషం నిబంధన అమలు చేయనున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనుండగా హాల్‌టికెట్‌తోపాటు గుర్తింపు కార్డుతోపాటు ఫొటో గుర్తింపు కార్డు తేవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ హనుమంతు కే. జెండగే




కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే. జెండగే

భువనగిరి అర్బన్, మే 18: పార్లమెంట్ ఎన్నికల లెక్కింపునకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షించి మాట్లాడారు. లెక్కింపు కేంద్రంలో ఫర్నిచర్, పత్రాల సీలింగ్, వివిధ దశల్లో కావాల్సిన సిబ్బంది నియామకం చేపట్టాలన్నారు. ఉత్తర్వులు, స్కానింగ్ పనులు, లేబర్, సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమీక్షలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు అమరేందర్, శేఖర్‌రెడ్డి, డీఈవో కే. నారాయణ రెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రామ్మూర్తి, డిప్యూటీ తహశీల్దార్ సురేష్, ఆర్.ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జూన్‌లోగా యూనిఫాం సిద్ధం చేయాలి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వచ్చే నెల 12వ తేదీ వరకు ఏకరూప దుస్తులు సిద్ధం చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేయాల్సిన వసతులపై ఆయన సమీక్షించి మాట్లాడారు. జిల్లాలోని పాఠశాలలు ప్రారంభమయ్యే వరకూ మౌలిక వసతులు కల్పించి విద్యార్థులను ఆహ్వానించాలని చెప్పారు. జిల్లాలోని 673 ప్రభుత్వ, ఎయిడెడ్, కస్తూర్బా, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలకు 51,848 మంది విద్యార్థులకు దుస్తులు కుట్టేందుకు వస్త్రం పంపినట్లు తెలిపారు.

541 స్వయం సహాయక సంఘాల ద్వారా ఏకరూప దుస్తులు కుట్టించి పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు అందించాలన్నారు. ఆయనవెంట డీఆర్డీవో ఎంఏ కృష్ణన్, డీఈవో కే.నారాయణరెడ్డి, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు వైష్ణవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



పలు ప్రాంతాల్లో పిడుగుపాటు

● గొర్రెలకాపరి మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

● 19 జీవాలు, ఒక గేదె మృత్యువాత

పెన్‌పహాడ్ / మిర్యాలగూడ రూరల్ / వేములపల్లి / త్రిపురారం, మే 18 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శనివారం పిడుగుపాటుకు ఒక గొర్రెల కాపరి మృతి చెందడంతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వర్షం పడుతుండటంతో చెట్ల కిందకు వెళ్తుండగా పిడుగుపాటుకు గురయ్యారు. వీరితో పాటు పలు జీవాలు, గేదెలు మృతి చెందాయి.



వెంకన్న మృతదేహం

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనాజీపురం గ్రామానికి చెందిన గొర్రెలకాపరి మట్టపల్లి వెంకన్న(55) శనివారం ఉదయం గొర్రెలు, మేకలను తీసుకుని దోసపాడు శివారులో మేపుతున్నాడు. సాయంత్రం గొర్లు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ అడవికి వెళ్లారు. వేపచెట్టు కింద వెంకన్న మృతదేహం కనిపించింది. వర్షం సమయంలో చెట్టు నీడకు వెళ్లగా పిడుగుపాటుకు గురై మృతి చెందాడని నిర్ధారించుకున్నారు. వెంకన్నకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



పిడుగుపాటుకు జేత్యాతండాలో మృతి చెందిన గొర్రెలు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో శనివారం పిడుగుపాటుకు 15 గొర్రెలు మృతి చెందాయి. కాపరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జేత్యాతండాకు చెందిన మాలోతు తావురియా గొర్రెలను మేపుకుంటూ తండా పరిధిలోని పచారిగడ్డ శివారులోకి వెళ్లాడు. ఆ సమయంలో వర్షం రావడంతో మేకలతో పాటు తాను కూడా సమీపంలోని చెట్టు కిందకు వెళ్లాడు. ఆ సమయంలో పిడుగుపడడంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా తావురియాకు గాయలయ్యాయి. దీంతో అతడిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆరోగ్యం నిలకడగా ఉంది. సుమారు రూ.1.50లక్షల విలువైన గొర్రెలు మృతి చెందాయని, తావురియా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నల్లగొండ జిల్లా వేములపల్లిలో పిడుగుపాటుతో గొర్రెలకాపరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆమనగల్లు గ్రామానికి చెందిన బయ్య వెంకన్న వృత్తిరీత్యా గొర్రెల కాపరిగా జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం గొర్రెలను కాయడానికి వెళ్లగా మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురవడంతో సమీపంలోని చెట్టుకిందకు వెళ్తుండగా పిడుగు పడడంతో వెంకన్నకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108వాహనంలో సూర్యాపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలో పిడుగుపాటుకు గురై రెండు మేకపోతులు, ఒక గేదె మృతి చెందాయి. బాధితుల వివరాల ప్రకారం లోక్యతండా గ్రామంలో రమావత్ బాలు, ధనావత్ కొండల్ తన మేకలను, గేదెలను మేత కోసం పొలాల్లోకి తీసుకుని తీసుకెళ్లారు. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన పిడుగులుపడ్డాయి. ఆ ప్రాంతంలో మేతమేస్తున్న మేకలు, గేదె ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. మేకల విలువ సుమారు రూ.20 వేలు, గేదె విలువ రూ.50వేలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

1,450 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం

నడిగూడెం, మే 18 : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఇటీవల వర్షాలు, ఈదురుగాలులకు 1,450 ఎకరాల్లో మామిడి పంటకు వాటిల్లినట్లు ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ నెల 5, 6, 7 తేదీలతో పాటు 17వ తేదీన వీచిన ఈదురుగాలులు, వర్షాలకు మామిడికాయలు రాలిపోయి పంట దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది మామిడి కాపు అంతంత మాత్రమే రాగా ఉన్న అరకొర పండి నెలపాలైంది. నడిగూడెం, మోతె, మునగాల, ఆత్మకూర్(ఎస్), అర్వపల్లి, ముదిరాల, నాగారం, పెన్‌పహాడ్, గరిడేపల్లి, నేరేడుచర్ల, మఠంపల్లి మండలాల్లో అధికారులు సర్వే చేసి 1450 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు. రైతుల వారీగా వివరాలను తీసుకొని ఆర్థికనష్టం ఏమేరకు జరిగిందనేది మరోసారి సర్వే చేస్తామని సూర్యాపేట సహాయ ఉద్యన శాఖాధికారి జగన్ శనివారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టం గుర్తిస్తామన్నారు.



నేలవాలిన మామిడిచెట్లు, రాలిన కాయలు

నడిగూడెంలో ఆరు సెంటీమీటర్ల వర్షం

రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను ప్రజలను సేదతీర్చాయి. శనివారం నడిగూడెంలో ఆరు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవడంతో నడిగూడెం లోతట్టు ప్రాంతలైన ఎస్సీ, బీసీ కాలనీల్లోకి నీరు చేరింది. వరద కాల్వల ద్వారా చెరువులోకి నీరు చేరుతుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లాలో శనివారం వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం వర్షానికి వీధులు జలమయం అయ్యాయి. అత్యధికంగా అనంతగిరిలో 2.3 మిల్లీమీటర్లు, అత్యల్పంగా చింతలపాలెంలో 0.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా రెండు రోజులుగా వీచిన ఈదురుగాలులకు జిల్లా కేంద్రంలోని తాళ్ళగడ్డలో ఒక ఇంటిపై ఏర్పాటుచేసిన హోర్డింగ్ బోర్డు ఓ వైపు ఒరిగింది. శనివారం స్థానికులు, కాంగ్రెస్ నాయకులు క్రేన్ సహాయంతో హోర్డింగ్ బోర్డును తొలగించారు.

44 రోజుల్లో 13 అడుగులు..

631అడుగులకు చేరిన మూసీ ప్రాజెక్టు నీటిమట్టం



కేతేపల్లి, మే 18 : గత 44 రోజుల్లో మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 13 అడుగుల మేర పెరిగి 631అడుగులకు చేరింది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టు నీటిమట్టం ఏప్రిల్ 5వ తేదీ నాటికి 618.18అడుగుల(0.38టీఎంసీలు)కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో ఎగువ మూసీ నదికి ఇరువైపులా పరివాహక ప్రాంతాల్లోని కత్వలు, ధర్మారెడ్డికాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహర్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానెళ్లకు హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటిని మళ్లించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాల్లోని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగులు పోస్తున్నాయి. అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతుంది. మరోవైపు హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. దీంతో వారం రోజుల వరకు ఆరేడు వందల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శుక్రవారం నుంచి 1000 క్యూసెక్కులకుపైగా నమోదవుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం శనివారం సాయంత్రానికి 631అడుగులు(1.50టీఎంసీలు)లకు చేరింది. ఎగువ నుంచి 1050క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 87క్యూసెక్కుల మేర నీరు లీకేజీలు, ఆవిరి రూపంలో వెళుతోంది. కాగా గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 641.10అడుగులు(3.47టీఎంసీలు)గా, ఇన్‌ఫ్లో 625క్యూసెక్కులుగా ఉంది.

నిలకడగా సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్, మే 18 : నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం వారం రోజులుగా 504.80 అడుగుల వద్ద నిలకడగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.5050టీఎంసీలు) కాగా ప్రస్తుతం 504.80 అడుగులు(123.0112టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి జంటనగరాల తాగునీటి అవసరాల కోసం ఏఎమ్మార్పీ ద్వారా 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 400 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి నీటి రాక లేదు. సాగర్ నుంచి కుడి, ఎడమ, వరద కాల్వలకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి నీటి విడుదల లేదు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

నూతనకల్, మే 18 : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో శనివారం విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి చెందాయి. అల్లునూర్ గ్రామానికి చెందిన బాధితుడు దిండిగాల లింగరాజు తెలిపిన వివరాల ప్రకారం తన గేదెలను మేత కోసం అడవికి తీసుకెళ్లాడు. శుక్రవారం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగి పడ్డాయి, అటు వైపు మేత మేసుకుంటూ వెళ్లిన నాలుగు గేదెలు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని విద్యుత్ శాఖ వారు నష్టపరిహారం చెల్లించాలని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంటు క్రాంతి కోరారు.















మహిమాన్వితం.. మట్టపల్లి మహాక్షేత్రం

దక్షిణ తెలంగాణ ప్రాంతంలోని నారసింహ క్షేత్రాల్లో ప్రాశస్తి పొందిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 21 నుంచి నిర్వహించే ఉత్సవాల కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. కృష్ణా నదీ తీరంలో కీతవరం, వేదాద్రి, మంగళగిరితో పాటు స్వయంభూవుగా వెలిసిన నారసింహుడు మహాక్షేత్రం జగక్షేత్ర రాజమందలి మహాతీర్థాల్లో విశిష్టమైంది. భక్తకోటి ఇష్టదైవంగా వర్ధిల్లుతోన్న క్షేత్రం రెండో యాదగిరిగుట్టగా ప్రసిద్ధి చెందింది.

● మఠంపల్లి


కృష్ణానదీ తీరంలోని మట్టపల్లి మహాక్షేత్రం

- 21 నుంచి బ్రహ్మోత్సవాలు
- కల్యాణోత్సవానికి తరలిరానున్న భక్తులు
- ప్రారంభమైన అధ్యయనోత్సవాలు

పూర్వం కృష్ణానదికి ఆవల ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా తంగేడ ప్రాంతాన్ని పరిపాలించే అనుముల మాచిరెడ్డి ప్రభువుకు ఒకనాడు స్వామివారు కలలో కనిపించారట. మీ గ్రామానికి సమీపంలోని కృష్ణా నదీ తీరం అవతలి వైపున ఉన్న అరణ్యంలో ఒక గృహలో తాను స్వయంవ్యక్తంగా వెలిశానని, ఇంతవరకు భరద్వాజులు, మహర్షులు మాత్రమే అర్చిస్తున్నారని, ఇకపై మానవులు కుడా పూజించటానికి లోకానికి తన తెలియపర్చి కీర్తిని చాటుకొమ్మని సెలవిచ్చాడని కథనం. స్వప్నంలో స్వామి ఆదేశించిన మేరకు మాచిరెడ్డి ప్రభుత్వం తన పరివారంతో వచ్చి మట్టపల్లిలోని గుట్టలు, పుట్టలు తొలగించారు. అయినా స్వామి వారు కనిపించకపోవటంతో విసిగి ఒక చెట్టుకింద విశ్రాంతి తీసుకున్నాడట. స్వామి వారిని మనస్సులో నీవు కనపించపోతే నా తనువు ఇక్కడే అంతమొదిస్తానని వేడుకున్నాడట. కరుణించిన స్వామి వారు మరో మారు మాచిరెడ్డికి స్వప్నంలో కనిపించి నీవు పడుకున్న దిశకు ఎదురుగా ఆరె చెట్టు దానిపై ఒక గరుడ పక్షి ఉంటుందని, ఆ పక్షి ఎటువైపు వెళ్లివాలితే అక్కడ ఉన్న గుహను తొలగించమని చెప్పాడు. మాచిరెడ్డి ప్రభువులు స్వామి చెప్పిన రీతిన గుహను తొలగించగా అందులో స్వయం వ్యక్తం నృసింహస్వామి దర్శనంతో తన్మయం చెందారని కథనం ప్రాచుర్యంలో ఉంది. అప్పటి నుంచి వెలుగులోకి వచ్చిన మట్టపల్లి మహాక్షేత్రం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. కాలక్రమేనా భక్తుల రద్దీ పెరగడంతో వారి సౌకర్యార్థ గుహకు ఉత్తరం వైపున మరో ద్వారాన్ని ఏర్పాటుచేశారు. ఇప్పటికి స్వామివారికి ప్రాతఃకాలాన ఆరె పత్రి పూజ ఇక్కడ నిర్వహిస్తారు. ఆలయంలో ఉన్న గృహద్వారం ద్వారా కృష్ణానదీలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకోవటం సాంప్రదాయంగా వస్తోంది.

హైదరాబాద్ నుంచి మట్టపల్లికి మార్గం

హైదరాబాద్ నుంచి మట్టపల్లికి వయా సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ మీదుగా 220 కిలోమీటర్లు, హైదరాబాదు నుంచి మట్టపల్లికి వయా నల్లగొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ మీదుగా 208 కిలోమీటర్ల దూరంలో క్షేత్రానికి చేరుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి గుంటూరు జిల్లా నుంచి వయా పిగుడురాళ్ల దాచేపల్లి మీదుగా తంగేడ నుంచి మట్టపల్లి క్షేత్రాన్ని చేరుకోవాలి. కోదాడ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, మాచర్ల డిపోల స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతాయి. మట్టపల్లి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం ఉదయం 5 గంటల నుంచి దైవదర్శనాలు ప్రారంభమవుతాయి.

స్వామి కంఠాన్ని తాకిన కృష్ణమ్మ

ప్రశాంతంగా ప్రవహించేకృష్ణమ్మ ఉప్పొంగి రెండు పర్యాయలు స్వామివారి కంఠాన్ని తాకింది. 2009లో వచ్చిన వరదలకు దేవాలయం పూర్తిగా ముంపునకు గురైంది. స్వా మి వారి గర్భగుడిలోకి వరద నీరు రావడం ఆలయ నిర్మాణాలు కొన్ని నీటి ఉధృతికి దెబ్బతినడంతో అప్పటి ప్రభుత్వం ఆలయం చుట్టూ రక్షణగోడ(కరకట్ట)నిర్మించింది. మట్టపల్లి క్షేత్రానికి రాష్ట్రంతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన శ్రీ ముక్కూరు పీఠం వారు లక్ష్మీనరసింహ చారియర్ ట్రస్ట్ స్థాపించి మట్టపల్లి క్షేత్రం గురించి విశేష ప్రచారం చేస్తున్నారు. ఇంతటి మహిమాన్వి త చరిత్ర గల మహాక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించాలని భక్తులు కోరుతున్నారు.

క్షేత్రంలో ముక్కూర్ పీఠం

తమిళనాడు రాష్ట్రం చెన్నై పట్టణానికి చెందిన శ్రీమాన్ ముక్కూర్ లక్ష్మీనరసింహ చారియర్ అనేవారు 1992లో మట్టపల్లి క్షేత్ర విశిష్టతను తెలుసుకొని ఈ ప్రాంత ప్రశాంతకు ముగ్ధుడై మట్టపల్లిలోని నృసింహస్వామి క్షేత్రంలో 107 యాగాలను నిర్వహించారు. 108వ యాగానికి ఏర్పాట్లు జరుగుతుండగా చిలుకూరు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ఆయన మరణించారు. అనంతరం వారి శిష్య బృందం స్వామి వారి పేరుమీద ప్రత్యేకంగా పీఠాన్ని ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మట్టపల్లిలో ముక్కూరు పీఠాన్ని ఏర్పాటు చేసి ప్రారంభోత్సవాన్ని గవర్నర్ నరసింహన్ దంపతులతో చేయించారు.

ఉత్సవాల క్రమం..

మట్టపల్లి క్షేత్రంలో ఈ నెల 21న శాత్తుమర్తైతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, రక్షాబంధనం, అఖండ దీపారాధన, అంకురారోపణం, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠాన, 22న సుప్రభాతం, ప్రాతఃకాలార్చనలు, పంచామృత అభిషేకాలు, ద్రవిడ ప్రబంధ సేవాకాలం, మల్లికాపుష్ప సహస్ర నామార్చన, లక్ష మల్లికా పుష్ప పూజ, ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఎదుర్కోలు మహోత్సవము, సాయంత్రం 4 గంటలకు నాదస్వర కచేరి, 6 గంటలకు శ్రీమాన్ ముడుంబై శ్రీనివాసాచార్యులు, శ్రీమతి రాఘవాలక్ష్మీమనోహర్ ఆధ్వర్యంలో భక్తి సంకీర్తన, 9 గంటలకు గుంటూరు వారిచే భక్త ప్రహ్లాద హరికథ, 10 గంటలకు శ్రీలక్ష్మీనృసింహ నామ సంకీర్తన, రాత్రి 11:30గంటలకు స్వామమి, అమ్మవారల ఉత్సవ మూర్తులకు ఎదుర్కోళ్లు, 12 గంటలకు శ్రీస్వామివారి తిరుకల్యాణమహోత్సవం (తలంబ్రాలు) వైభవంగా జరగనున్నాయి. 23న స్వామివారికి గరుడవాహన సేవ, 24న హంసవాహన ఉత్సవం, 25న వసంతసేవ(ప్లవోత్సవం) చక్రతీర్థం, హోమం, పూర్ణాహుతి, 26న ద్వాదశ సేవలు, శృంగార డోలోత్సవం, పవళంపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లి, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్‌లు శనివారం తెలిపారు. ఈ ఉత్సవాలను బొర్రా వెంకటవాసుదేవాచార్యులు, పరాశరం వెంకటాచార్యులు, హరికిరణాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


అలంకరణలో లక్ష్మీనృసింహుడు

21 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు

మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 21 నుంచి 26 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి ఏటా వైశాఖ శుద్ధ త్రయోదశిలో జరిగే స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించేందుకు దేవస్థానం నిర్వాహకుఉ అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని రకరకాల విద్యుత్ రంగులతో ఆకర్షణీయంగా సుందరంగా తీర్చిదిద్దారు. వేసవి దృష్ట్యా కల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచేకాకుండా తమిళనాడు, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. క్షేత్రంలోని అన్నికులాల వారు అన్నదానాలను నిర్వహించనున్నారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఏపీ రాష్ట్రం నుంచి పిడుగురాళ్ళ, మాచర్ల, తెలంగాణ నుంచి కోదాడ, మిర్యాలగూడ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

మట్టపల్లిలో అధ్యయనోత్సవాలకు శ్రీకారం


అధ్యయనోత్సవాలను ప్రారంభిస్తున్న స్థానాచార్యులు

మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహుని ఆలయంలో ఈ నెల 21న ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగు రోజులు పాటు నిర్వహించనున్న అధ్యయనోత్సవాలకు శనివారం రాత్రి శ్రీకా రం చుట్టారు. ఆగమ శాస్త్రానుసారం జరిగిన ఈ క్రతువులో నిత్యవిధి కైంకర్యాలను చేపట్టారు. పరమ భక్తాగ్రేసరుడైన నమ్మాళ్వారులకు తిరుమంజనం అనంతరం సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, తులసీమాలలతో తీర్చిదిద్ది అలంకారసేవలు చేపట్టారు. అ నంతరం రుత్వికులు దివ్యప్రబంధ వేదపఠనం జరిపారు. తదుపరి మంగళవాయిద్యాలతో నేత్రపర్వంగా పల్లకిసేవ జరిగింది. భగవద్రామానుజాచార్యులు అవతరణ ఘట్టాలను భక్తులకు వివరించారు. ఇతర పర్వాలతో ఈ నెల 21వరకు అధ్యయనోత్సవాలు కొనసాగనున్నాయి. ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లి, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, స్థానాచార్యులు కె.బదరీనారాయణాచార్యులు, కె.నరసింహాచార్యులు, పద్మనాభాచార్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


రాజాపేట మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

రాజాపేట, మే 18: ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన, నిల్వ ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో గాంధీ చౌరస్తా వద్ద రైతులు సుమారు గంటసేపు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ఐకేపీ కేంద్రాలకు తరలించిన ధాన్యం అకాల వర్షంతో తడిసిందని, లారీలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో చాలా రోజులుగా ఎదురుచూస్తున్నామని, నిర్వాహకులు పలు కారణాలు చెప్పి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలేదని అన్నారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకొని కొనుగోళ్లను వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. కార్యక్రమంలో రైతులు ఊట్కూరి అశోక్‌గౌడ్, దాచపల్లి రాజు, మెండు భగవాన్‌రెడ్డి, దాచపల్లి శ్రీను, వీరస్వామి, నగేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

బావిలో బాలుడి గల్లంతు : లభించని మృతదేహం

తిరుమలగిరి, మే 18: ఈత సరదా ఓ బాలుడి ప్రాణం తీసింది. ఈత నేర్చుకునేందుకు వెళ్లి బావిలో గల్లంతయ్యాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలో శనివారం జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి మునిసిపాలిటీకి చెందిన చిన్నూరి వెంకటయ్య, ఆయన కుమారుడు శ్రీకాంత్(13), కుమార్తె మాధవిలను ఈత నేర్పడానికి ఐదారురోజులుగా ఓ బావి వద్దకు తీసుకెళ్తున్నాడు. శనివారం రోజు కూడా కుమారుడు, కుమార్తెను ఈత నేర్పించేందుకు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తీసుకెళ్లాడు. ఈ క్రమంలో బావిలోకి దిగి కుమార్తెకు నీటిలో మునగకుండా నడుముకు తాడు కట్టి ఈత నేర్పిస్తుండగా, కుమారుడు శ్రీకాంత్ తండ్రిని అనుసరించకుండా బావిలోకి దూకాడు. అతడు ఎంతకీ పైకి రాకపోవడంతో పక్కనే ఉన్న పిల్లలు కేకలు వేయడంతో, బావిలో వెతికినా ఫలితం లేకపోయింది. అప్పటికే అతడు పూర్తిగా బావిలో మునిగినట్లు గుర్తించారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించగా, వారితోపాటు ఫైర్‌సిబ్బంది సహకారంతో సాయంత్రం ఐదు గంటల నుంచి బావిలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. శ్రీకాంత్ మృతదేహం ఇంకా లభించలేదు.

లారీ డ్రైవర్ రిమాండ్

పెద్దఅడిశర్లపల్లి, మే 18 : నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఇద్దరి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11వ తేదీన రాత్రి 11గంటల సమయంలో పెద్దఅడిశర్లపల్లి మండలం కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మరియదాసు అటుగా వచ్చిన ఆటోను నిలిపి ప్రశ్నిస్తున్నాడు. ఇంతలో అతివేగంగా వచ్చిన లారీ ఆటోను వెనక నుంచి ఢీకొనడంతో హెడ్‌కానిస్టేబుల్ మరియదాసు అక్కడికక్కడే మృతి చెందాడు. అదేవిధంగా ఆటోలో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మందిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా పెద్దరావీడు మండలం ప్రగళ్లపాడుకు చెందిన మంత్ర పెద్దఅంజమ్మ(60)కు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఘటన అనంతరం లారీ డ్రైవర్ భూక్య రమేష్ పరారీలో ఉండగా శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రవరం బ్రహ్మోత్సవాలకు మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం

కోదాడ రూరల్, మే 18 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని ఎర్రవరంలోని దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి కల్యాణమహోత్సవ ఆహ్వాన పత్రికను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి నిర్వాహకులు శనివారం అందజేశారు. ఈ నెల 21 నుంచి 23 వరకు వేడుకలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రికి వివరించారు. కల్యాణ వేడుకలకు హాజరవుతానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు భాషబోయిన భాస్కర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, షేక్ లతీఫ్, వేమూరు మధు, వీరేపల్లి నాగేంద్రప్రసాద్, బెల్లంకొండ ఉపేందర్, రావుల వెంకటేశ్వర్లు, వల్లెపు సుదర్శన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

యాదగిరీశుడి సన్నిధిలో భక్తుల కోలాహలం

భువనగిరి అర్బన్, మే 18: యాదగిరిగుట్ట దివ్య క్షేత్రం శనివారం స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో జన సందోహంగా మారింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాల్లో వచ్చారు. కాగా, సుమారు 40వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు రెండుగంటలు, ధర్మదర్శనాలకు మూడు గంటల సమయం పట్టింది. ప్రధానాలయం, ప్రసాద విక్రయశాలల వద్ద కూడా రద్దీ నెలకొంది. భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు రద్దీకి సరిపడా బస్సులు నడపకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.51,82,041 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.


నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు, శివాలయంలో ఎదురుగా మెట్ల దారి వెంట భక్తుల రద్దీ

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి, విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ ఆగమశాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో రామలింగేశ్వర స్వామికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.

20 నుంచి యాదగిరీశుని జయంత్యుత్సవాలు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో ఈ నెల 20 నుంచి 22 వరకు స్వామివారి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరికొండపై శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాదగిరిగుట్ట, పాతగుట్ట, దబ్బగుంటపల్లిలో నిర్వహించే జయంతి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. జయంతి ఉత్సవాల సందర్భంగా ఆర్జితసేవలు మూడు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ఈవో తెలిపారు.

యాదగిరికొండపై వచ్చే నెల 1 నుంచి డ్రెస్‌కోడ్

యాదగిరి క్షేత్ర దర్శనానికి వచ్చే భక్తులు జూన్ 1 నుంచి ఆలయంలో సంప్రదాయ దుస్తులు ధరించి ఆర్జిత సేవల్లో పాల్గొనాలని ఈవో భాస్కర్‌రావు తెలిపారు. గత నెల 2న 'సంప్రదాయ దుస్తుల పట్టింపేదీ' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయంలో ఇప్పటివరకు సంప్రదాయ దుస్తులు ధరించాలనే నిబంధన లేదు. ఆలయంలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు సంప్రదాయ దుస్తులు ధరించడం ఆనవాయితీ. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుంచి భక్తులకు డ్రెస్ కోడ్ అమలు చేస్తున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించి రావాలని ఈవో కోరారు. వీఐపీ, బ్రేక్ దర్శనాలకు డ్రెస్ ఉంటుందని, ధర్మదర్శనాలకు మాత్రం డ్రెస్ కోడ్ లేదన్నారు.

రాష్ట్రంలో బీజేపీకి మెజార్టీ ఎంపీ సీట్లు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

భువనగిరి టౌన్, మే 18 : పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధిక సీట్లు సాధించడం పక్కా. అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరిలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4న వచ్చే ఫలితాల్లో బీజేపీకి డబుల్ డిజిట్ సీట్లు రావడం, కేంద్రంలో నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం అద్భుత ఫలితాలతో విపక్షాల కళ్లు మండడం ఖాయమన్నారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీ వార్డుతో సహా అన్ని పదవులకు బీజేపీ పోటీ చేస్తుందన్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అయితే భవిష్యత్ ఎన్నికలన్నింటిలో కాంగ్రెస్ ఓడిపోనుండగా బీఆర్ఎస్ గల్లంతు కానుండగా బీజేపీ మాత్రమే ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ అవినీతి పాలనతో విసిగి ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తన ఎన్నికల హామీలను నిలుపుకోవడంతో విఫలం అవుతుందన్నారు. ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే వరకు ప్రజల పక్షాన బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ గెలిచే సామర్థ్యం కోల్పోతుండగా బీఆర్ఎస్ తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కాపాడుకోలేని స్థితికి చేరుకుందన్నారు. పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపుకు ప్రతీ కార్యకర్త శ్రమించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యావంతులు, నిరుద్యోగ, విద్యార్థుల ప్రయోజనాలను, హక్కులను కాపాడేందుకు చట్టసభల్లో పోరాడేందుకు తనను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికను కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని గెలుపు కోసం పోరాటం చేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడుఉ పాశం భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ జీ మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల పార్లమెంట్ ఇన్‌చార్జి తాడూరి శ్రీనివాస్, చందుపట్ల వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా, మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ, నర్ల నర్సింగ్‌రావు, వంగేటి విజయ భాస్కర్‌రెడ్డి, పడమటి జగన్మోహన్‌రెడ్డి, జె శ్యాంసుందర్‌రెడ్డి, పట్నం శ్రీనివాస్, నీలం రమేష్, ఊదరి లక్ష్మీ, కవిత, బలరాం, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి శనివారం భువనగిరిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రైవేట్ ఉపాధ్యాయులు, లెక్చరర్లు, న్యాయవాదులు, వ్యాపారస్తులైన ఓటర్లను కలిసి తనకు మద్దతివ్వాలని కోరారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

సూర్యాపేటక్రైం, మే 18: సూర్యాపేట జిల్లాకేంద్రంలో విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జీ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కోల శ్రీదేవి(40) శుక్రవారం రాత్రి నీటి కోసం వారి ఇంటిలోని బోరుమోటారు స్విచ్ ఆన్‌చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. ఆ సమయంలో భర్త నగేష్, కుమారుడు ఇంట్లో ఎవరూ లేరు. రాత్రి 8 గంటల తర్వాత భర్త నగేష్ ఇంటికి వచ్చి చూడగా శ్రీదేవి కిందపడిపోయి ఉంది. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భర్త నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

అస్వస్థతతో ఉపాధి కూలీ...

సూర్యాపేట రూరల్, మే 18 : సూర్యాపేట జిల్లాలో శనివారం ఉపాధిహామీ పనులు చేస్తూ కూలీ మృతి చెందాడు. స్థానికులు, కూలీలు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట మండలం సపావత్‌తండా అవాసప్రాంతమైన జేతునాయక్ తండాకు చెందిన రమావత్ సేవానాయక్(70) గ్రామచెరువులో ఉపాధిహామీ పథకం కింద పూడికతీత పనులకు వెళ్లాడు. పనిచేసే క్రమంలో అతడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు, వెంటనే గమనించిన తోటి కూలీలు సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

1,350 కిలోల నల్లబెల్లం, పటిక స్వాధీనం

దేవరకొండ, మే 18 : నల్లగొండ జిల్లా దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శేరిపల్లిగేటు వద్ద కారులో తరలిస్తున్న నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటికలను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. శేరిపల్లి రోడ్డు వద్ద కారులో తరలిస్తున్న 1,350 కిలోల నల్లబెల్లం, 200 కిలోల పటికను స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేశామన్నారు. ఇందుకు బాధ్యుడుఐన ఉప్పువాగు వడ్డెరకాలనీకి చెందిన సంపెంగి రామును అరెస్ట్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు నర్సింహ, వీరబాబు, కృష్ణ, పాల్గొన్నారు.

గోదాం నుంచి నేరుగా మిల్లులకు రేషన్ బియ్యం

పెద్దవూర, మే 18 : సివిల్ సప్లయ్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులతో కలిసి నకిలీ కాగితాలు సృష్టించి గోదాం నుంచి నేరుగా మిల్లులకు భారీగా తరలించిన రేషన్ బియ్యాన్ని నల్లగొండ టాస్క్‌ఫోర్స్, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా పెద్దవూర ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం తెప్పలమడుగు గ్రామ శివారులోని అమ్మా రైస్‌మిల్లులో లారీల ద్వారా రేషన్ బియ్యాన్ని తరలించి అక్రమంగా నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి దాడులుచేశారు. మిల్లులో 749 బస్తాల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అమ్మా రైస్ మిల్లు యజమాని మలిగిరెడ్డి రామానుజరెడ్డి, సివిల్ సప్లయ్ విభాగంలో స్టేజ్-2 కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న బూరుగు శ్రీనివాస్, కుక్కడం రమేష్‌లు నల్లగొండలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న లింగాల మల్లేష్, శ్రీకాంత్‌లతో కలిసి పథకం ప్రకారం గోదాం నుంచి మండలాల్లోనే ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించే బియ్యాన్ని దొంగ సర్టిఫికెట్లు తయారు చేసి, ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలిస్తున్నట్లు కాగితాలు సృష్టించారు. రేషన్ బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి వాటిని ఎంఎల్ఎస్ గోదాంకు తరలించకుండా బూరుగు శ్రీనివాస్ వద్ద పనిచేస్తున్న ఎడ్ల ఆంజనేయులు అనే వ్యక్తి ఈ నెల 15, 16న రెండు లారీల్లో నల్లగొండలోని ఎస్‌డబ్ల్యూఎస్ గోదాం నుంచి నేరుగా రామానుజరెడ్డికి చెందిన అమ్మా రైస్ మిల్‌కు తరలించి వాటిని వేరే బ్యాగుల్లో ప్యాక్ చేసి తిరిగి ప్రభుత్వానికి విక్రయించడానికి తయారు చేస్తున్నారని తెలిపారు. అందుకు మిల్లులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న వెంపటి సంతోష్‌కుమార్, క్యాషియర్‌గా పనిచేస్తున్న లింగంపల్లి సైదులు సహకరిస్తున్నట్లు తెలిపారు. కాగా ఈనెల 16న బియ్యాన్ని నింపుకుని ఎడ్ల ఆంజనేయులు అమ్మ రైస్ మిల్లు వద్దకు రాగా విషయం తెలుసుకున్న నల్లగొండ టాస్క్‌ఫోర్స్ అధికారులు, పెద్దవూర పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న లారీతో పాటు కాగితాలను, 749 బస్తాల బియ్యంతో పాటు విడి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పౌర సరఫరాల శాఖకు అప్పగించామన్నారు. లింగాల మల్లేష్, వెంపటి సంతోష్‌కుమార్, సైదులు, ఎడ్ల ఆంజనేయులు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు, మిగతావారు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.


లారీలో లోడ్‌తో ఉన్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు, పోలీసులు

రైతులు అధైర్య పడవద్దు

●రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొంటుంది: ప్రభుత్వ విప్ అయిలయ్య


రైస్ మిల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, మే 18: రైతన్నలు అధైర్యపడవద్దని, రైతన్నల వద్ద ఉన్న ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం ఆలేరులోని మల్లికార్జున రైస్ మిల్లును, ఆలేరు వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని రైతన్నలు, ప్రజలు నమ్మవద్దన్నారు. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యమే గోదాముల్లో నిల్వ ఉండడంతో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. కలెక్టర్ జాయింట్ కలెక్టర్లతో మాట్లాడానని, రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరానన్నారు వారం రోజుల్లోనే రైతన్నల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఇప్పటికీ రైతన్నల వద్ద నుంచి 25లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని రైతన్నల వద్ద ఉన్నది కేవలం 10లక్షల టన్నుల ధానన్యమేనన్నారు. ఆలేరు, మోటకొండూరు వ్యవసాయ మార్కెట్‌లలో కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను రెండు రోజుల్లోనే రైతన్నల ఖాతాల్లోకి జమ చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా రైతులకు ఎన్నిగంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు అని బీర్ల అయిలయ్య విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్లాస్టిక్ కంచెలను ఏర్పాటు చేయాలని, ఇనుప స్తంభాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఆలేరు, యాదగిరిగుట్ట ఎంపీపీలు గంధమల్ల అశోక్, చీర శ్రీశైలం, మోటకొండూరు వైస్‌ఎంపీపీ ఎల్లందుల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు ఎంఏ.ఎజాజ్, ముదిగొండ శ్రీకాంత్, కందుల సురేష్, సంతోష్, పేరపు రాములు, ఎగ్గిడి శ్రీశైలం, కృష్ణ ఉన్నారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు

భువనగిరి టౌన్, మే 18: పార్లమెంట్ ఎన్నికల తంతు ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. శనివారం భువనగిరిలో జరిగిన పార్టీ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తూ ఎన్నికల చుట్టూ పాలకులు తిరుగుతున్నారన్నారు. ప్రజా ప్రయోజనకర పథకాలను, ఎన్నికల హామీలను అమలు చేయాలన్నారు. నీట మునిగిన వరి ధాన్యాన్ని మద్దతు ధర, బోనస్‌తో కలిపి వెంటనే కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ రంగంపై ప్రభుత్వం దృష్టి పెట్టకుంటే రైతుల ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. జిల్లా సమస్యలపై సీపీఎం త్వరలో పోరుబాట పట్టనున్నదన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు భట్టుపల్లి అనురాధ, కొండమడుగు నర్సింహ, నాయకులు మంగ నర్సింహులు, మాటూరి బాల్‌రాజ్, కల్లూరి మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకటేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై చిత్తశుద్ధి లేని సీఎం రేవంత్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీత

భువనగిరి అర్బన్, మే 18: సరైన ప్రణాళికలు లేకుండా వ్యవహరించడమే కాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత ఆరోపించారు. యాదగిరిగుట్టలో శనివారం తన స్వగృహంలో కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. సీఎం రాష్ట్రంలో నిరుద్యోగులను మోసగిస్తూ పాలన చేస్తున్నాడన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన నోటిఫికెషన్లతోనే సీఎం రేవంత్ ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరుద్యోగుల ముందు సొంత డబ్బా వాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. నిజానికి కేసీఆర్ ప్రభుత్వమే నిరుద్యోగులకు అండగా ఉండి ఆదుకుందన్నారు. ఈ నెల 19న ఆలేరు పట్టణంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్, మారెడ్డి కొండల్‌రెడ్డి, పాండవుల భాస్కర్, బాబురావు, గడ్డం చంద్రం, ఆరె శ్రీధర్, బండి వాసు, గ్యాదపాక క్రాంతి పాల్గొన్నారు.

బక్కారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి


బక్కారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మోత్కూరు, మే 18: సీపీఐ సీనియర్ నాయకుడు దివంగత కొణతం బక్కారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి కోరారు. బక్కారెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం మోత్కూరు కేఆర్‌భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. బక్కారెడ్డి విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితుడై ఆ పార్టీలో చేరి పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడారని, తాలూకా కార్యదర్శి నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, సీపీఐ మోత్కూరు మండల, పట్టణ కార్యదర్శులు అన్నెపు వెంకట్, పుల్కరం మల్లేష్, నాయకులు చాపల అంజయ్య, పోచం కన్నయ్య, పెండెం వెంకటేశ్వర్లు, తాడూరు లక్ష్మీనర్సయ్య, నిలిగొండ అశోక్, గొలుసుల యాదగిరి, కడమంచి వీరస్వామి పాల్గొన్నారు.

యూజీడీ కోసం ఎదురుచూపు

● బస్తీల్లో వృథాగా ఉన్న పైపులు
● పనులను కొనసాగించాలంటున్న ప్రజలు



నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా ఉన్న బహిరంగ మురుగుకాల్వ, భువనగిరి ఆజాద్ రోడ్డులో వృథాగా ఉన్న యూజీడీ పైపులు

భువనగిరి టౌన్, మే 18: దుర్వాసన, అపరిశుభ్రత నివారణ లక్ష్యంగా భువనగిరి మునిసిపల్ పరిధిలోని పలు మురుగు కాల్వలను గత ప్రభుత్వంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ)గా మార్చింది. దీంతో పలు బస్తీలలో బహిరంగ మోరీలు కనుమరుగు కావడంతో పాటు రహదారులు విశాలమయ్యాయి. కానీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తారుమారు కావడంతో యూజీడీ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఫలితంగా పలు బస్తీలలో నేటికీ మోరీల సమస్య యథావిధిగా కొనసాగుతోంది. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో అంటువ్యాధులు కూడా ప్రబలే అవకాశాలు ఉంటాయి. అంతే కాక వర్షాలతో వరద, మురికి నీరు రహదారులపై ప్రవహించే పరిస్థితులు ఉన్నాయి. ఈ మేరకు నష్ట నివారణకు, పట్టణ అభివృద్ధికి యూజీడీ పనులను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

గత ఎన్నికల ముందు యూజీడీ పనులు

గత అసెంబ్లీ ఎన్నికల ముందు పట్టణంలో భారీ వ్యయంతో పలు ప్రాంతాల్లో యూజీడి పనులను చేపట్టారు. అయితే ఆ పనుల్లో శాస్త్రీయత, నాణ్యత లేదని అప్పట్లో విమర్శలు వచ్చాయి. కానీ యూజీడీ పనులు అనంతరం పునర్నిర్మించిన రోడ్లతో బస్తీలన్నీ విశాలమయ్యాయి. అంతేకాక దుర్గంధం, అపరిశుభ్రత, దోమల వ్యాప్తి తదితర సమస్యలు కూడా తీరాయి. కానీ మ్యాన్ హోల్స్ నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరు మోరీలలోకి వెళ్లలేక రహదారుల వెంటనే ప్రవహిస్తున్నాయి. అయితే యూజీడీలో పేరుకుపోయిన వ్యర్థాలను, పూడికను వెలికి తీసేందుకు రూ.35లక్షల వ్యయంతో మిషనరీని మునిసిపాలిటీ త్వరలో కొనుగోలు చేయనుంది. ఆ యంత్రం అందుబాటులోకి వస్తే యూజీడీని శుభ్రం చేయడం సులువై మురికి నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగుతాయి. అధునాతన యంత్రం అందుబాటులోకి వస్తే యూజీడీపై ఇప్పటి వరకు ఉన్న అనుమానాలు నివృత్తమయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. దీంతో తమ ప్రాంతాల్లోనూ యూజీడీని అభివృద్ధి చేయాలని ప్రజల డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. అప్పట్లో యూజీడీ కోసం కొనుగోలు చేసిన పైపులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధుల వెంట వృథాగా పడి ఉన్నాయి. మరికొన్ని చోరీకి కూడా గురయ్యాయి.


యూజీడీ అనంతరం పునర్నిర్మించిన రోడ్డుతో విశాలమైన నెహ్రూరోడ్డు

కనీసం తక్కువ వ్యయంతో పూర్తయ్యే ప్రాంతాల్లోనైనా యూజీడీ పనులను చేపట్టాలని స్థానికులు మునిసిపల్ యంత్రాంగాన్ని కోరుతున్నారు. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ రామాంజుల్‌రెడ్డి మాట్లాడుతూ అవకాశం ఉన్న చోట యూజీడీ నిర్మాణానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు.

మురుగు కాల్వలను యూజీడీలుగా మార్చాలి



పట్టణంలోని అంతర్గత బస్తీలన్నింటిలోని బహిరంగ మోరీలను యూజీడీలుగా అభివృద్ధి చేయాలి. అసెంబ్లీ ఎన్నికలతో నిలిచిన యూజీడీ పనులను తిరిగి ప్రారంభించాలి. యూజీడీతో పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజల ఆరోగ్య సమస్యలు కూడా తీరుతాయి. మేము నివాసం ఉండే ఇందిరానగర్‌లో ఒక వైపు గతంలోనే యూజీడీ పూర్తి కాగా మరో వైపు అసంపూర్తిగానే ఉన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవకాశం ఉన్న ప్రతీ చోట యూజీడీని అభివృద్ధి చేయాలి.

-బుచ్చాల సురేంద్రనాథ్, భువనగిరి

కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత నివారించాలి


వలిగొండ: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ/ రాజాపేట, మే 18: గోకారం, జాలుకాలువ ఐకేపీ కొనుగోలు కేంద్రాలల్లో లారీలు, గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, గ్రామ శాఖ కార్యదర్శి కవిడే సురేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యాన్ని మిలర్లు కటింగ్ పేరుతో, వర్షంలో తడిసిన ధాన్యం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. గోకారం కొనుగోలు కేంద్రంలలో సరిపడా లారీలను ఏర్పాటు చేసే విషయంపై అధికారులు నిర్లక్ష్యం ఆరోపించారు. ఇటీవలే కురిసిన భారీ వర్షం వల్ల ధాన్యం తడిసి మొలకెత్తిందన్నారు. గన్నీ బ్యాగులు, లారీలు లేక మార్కెట్లో కొనుగోలు నిలిపివేశారని రంగు మారిన ధాన్యం ఏ-గ్రేడ్ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకయ్య, వెంకటేష్, యాదగిరి, మల్లేష్, జంగయ్య, బాలకృష్ణ, అంజయ్య పాల్గొన్నారు.

రాజాపేట: మండలంలోని పాముకుంట, బేగంపేట, రాజాపేట గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం బీజేపీ కిసాన్ మోర్చా, సీపీఐ నాయకులు పరిశీలించారు. త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మెండు భగవాన్‌రెడ్డి, బూరుగు శేఖర్‌రెడ్డి, సట్టు వేణు, రంగా నరేష్‌గౌడ్ ఉన్నారు.

పెండింగ్ పనులన్నీ పూర్తిచేస్తాం

● ఎమ్మెల్యే మందుల సామేల్


మోత్కూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, మే 18: ఎన్నికలు ముగియగానే మోత్కూరు మునిసిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న పనులు, రోడ్డు పని పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కూడా భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, అవిలిమల్లు, మునిసిపల్ కోఆప్షన్ సభ్యురాలు ఆనందమ్మ పాల్గొన్నారు.

తుర్కపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుద్దుల సునీత కోరారు. శనివారం మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాట్లాడారు. నాయకులు ఎరుకల వెంకటేశ్‌గౌడ్, దేవరుప్పల మల్లేశం, అయిలయ్య, డి.బాలయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చౌటుప్పల్ టౌన్ : కండరాల క్షీణత వ్యాధి బాధితులు ఆత్మవిశ్వాసంతో జీవించాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, చండూరు మండలాలకు చెందిన కండరాల క్షీణత వ్యాధి బాధితులకు సమకూర్చిన రెండు లక్షల విలువైన నిత్యావసర సరుకులను ఆర్డీవో శేఖర్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తుపాకుల రవి, అమ్మానాన్న అనాథాశ్రమం నిర్వాహకుడు గట్టు శంకర్, కత్తుల బాలకృష్ణ, ఎ.పరమేష్, సుధీర్, సుదర్శన్, వేణుకుమార్ పాల్గొన్నారు.

వలిగొండ: సాగునీటి కాలువలో గుర్రపుడెక్క ఆకు తొలగింపునకు సహకరిస్తున్న దివీస్ లేబోరేటరీస్ లిమిటెడ్ సహకారం అభినందనీయమని డిప్యూటీ ఇంజనీరింగ్ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని గోకారం గ్రామంలో గల రామసముద్రం చెరువు నుంచి ధర్మారెడ్డిపల్లి కాలువ గుర్రపుడెక్క పూడికతీత పనులను దివీస్ లేబోరేటరీస్ సౌజన్యంతో ప్రారంభించారు.

రాజాపేట: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు దూడుక రాజప్ప అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా ఆయన కుటుంబానికి రూ.1.50లక్షల చెక్కును తహసీల్దార్ దామోదర్ అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చెక్కు అందజేసిందని ఆయన తెలిపారు.

భువనగిరి రూరల్: 108 అంబులెన్స్‌లోని వాహనాలపై ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పైలెట్ల ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా మేనేజర్ శివరాం ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్ శనివారం తెలిపారు. ఈఎంటీ ఉద్యోగానికి బీఎస్సీ బైపీసీ, ఎస్ఎస్ఎస్సీ పూర్తి చేసి ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేసి 30 సంవత్సరాలలోపు ఉన్నవారు అర్హులు అన్నారు. 108 డ్రైవర్ పనిచేయడానికి ఎస్ఎస్ఎస్సీ పాసై ఉండి, డ్రైవింగ్ లైసెన్స్ బ్యాచ్ నెంబర్ వచ్చి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని 108 కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని కోరారు.

రామన్నపేట: ఇటీవల విడుదలైన టీఎస్ ఎప్‌సెంట్ ఫలితాల్లో మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన కూరెళ్ల వెన్నెల అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 142వ ర్యాంకు సాధించింది. వెన్నెల పదవ తరగతి చౌటుప్పల్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో చదవగా, హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. వెన్నెల తల్లిదండ్రులు కూరెళ్ల భిక్షమాచారి, కవిత, గ్రామస్థులు అభినందిచారు.

వలిగొండ: పీడీఎస్ అక్రమంగా బియ్యాన్ని తరలిస్తుండగా పట్టివేశారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి మండలం పచ్చర్లబోడు తండాకు చెందిన గుగులోతు కుమార్ పరిసర ప్రాంతాల్లో గ్రామస్థుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించి నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. రెడ్లరేపాక గ్రామ పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా 10క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి, సదరు వ్యక్తిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వలిగొండ: ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన ప్రకారం మండలంలోని గోకారం గ్రామ పరిధిలో ప్రమాదవశాత్తు కట్టెల లారీ బోల్తా పడింది. డ్రైవర్, మరో నలుగురికి గాయాలయ్యాయి. సంస్థాన్ నారాయణపురానికి చెందిన వారు స్వల్ప గాయాలు కాగా, చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికతను అలవరచుకోవాలి


చౌటుప్పల్‌లో వాసవీమాత విగ్రహంతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

మోత్కూరు, మే 18: ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మోత్కూరు బ్రహ్మంగారి ఆలయంలో నిర్వహించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రపంచానికే దేవుడని, ఆయన ఆనాడు చెప్పిన కాలజ్ఞానమే నేడు నిజమవుతోందని అన్నారు. విశ్వకర్మల అభివృద్ధికి, బ్రహ్మంగారి ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, పైళ్ల సోమిరెడ్డి, డి.సత్యనారాయణచారి, సతీష్, డి.బ్రహ్మచారి, మారోజు వెంకన్న, హన్మకొండ శ్రీను పాల్గొన్నారు.

భువనగిరి టౌన్/ భువనగిరి రూరల్: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మ కల్యాణోత్సవం భువనగిరిలోని బ్రహ్మంగారి ఆలయంలో, మండలంలోని చందుపట్లలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొల్లోజు సతీష్, డీఎన్ చారి, ఎస్ గోవర్ధనాచారి, దేవేంద్రచారి, పి నరేందర్, శ్రీనివాస్, కృష్ణాచారి, టి.గిరిధరచారి, విజయ్‌కుమార్, రాజు, మహంకాళి, బ్రహ్మచారి, నందు, నర్సింహచారి, వంశీ పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని వెల్వర్తి గ్రామంలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వర స్వామి 11వ వార్షిక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. దేవాలయ చైర్మన్ ఉప్పలయ్య, ధర్మకర్తలు, వెంకట నారాయణ, విజయ్, సుగుణ, ఉష, ఎంపీటీసీ ఎడవెల్లి సత్తమ్మ యాదగిరి పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్/ గుండాల : స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి ఉత్సవాలను నిర్వహించారు. పట్టణంలో మహిళలు వాసవి మాత విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలలోచౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మంచికంటి భాస్కర్ గుప్త, మునిసిపల్ కౌన్సిలర్ కామిశెట్టి శైలజ, కామిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. గుండాలమండల కేంద్రంలోని గ్రంథాలయంలో వాసవీమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, దశరథ, సత్యనారాయణ, బాలరాజు, రమేశ్, సుధాకర్, యాదగిరి పాల్గొన్నారు.

గుండాల: మండలంలోని సుద్దాల గ్రామంలో హనుమాన్ ఆలయంలో హనుమాన్ భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పూజారి వెంకటేశ్వరచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ లింగం పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల పనులను 10లోగా పూర్తి చేయాలి


ఆదర్శ పాఠశాలలపై అధికారులతో సమీక్షిస్తున్న సీఈవో శోభారాణి

బీబీనగర్, మే 18: అమ్మ ఆదర్శ పనులను జూన్ 10లోగా పూర్తి చేయాలని జడ్పీ సీఈవో శోభారాణి అధికారులకు సూచించారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 36 ప్రభుత్వ పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలకు ఎంపికయ్యాయని, పనులను వెంటనే వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా తాగు నీరు, మరుగుదొడ్ల మరమ్మతులు, తరగతి గదుల మరమ్మతు పనులను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె వెంట ఎండీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంఈవో నాగవర్ధన్ రెడ్డి ఉన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం

రామన్నపేట, మే 18: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందడమే గాక, వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతుందని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బ్రహ్మానంద అన్నారు. ఇలాంటి పుస్తకాల గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెబుతూ తన సొంత ఇంటినే గ్రంథాలయంగా మార్చిన ఘనత పద్మశ్రీ అవార్డు గ్రహీత విఠలాచార్యకు మాత్రమే దక్కుతుందని అన్నారు. శనివారం మండలంలోని వెల్లంకి గ్రామంలో విఠలాచార్యను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.అశోక్, వెల్లంకి గ్రామ మాజీ సర్పంచ్ కూరెళ్ల నర్సింహాచారి, స్వామి, జినుక గోవర్ధన్ ఉన్నారు.

కోర్టులోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు

భువనగిరి టౌన్, మే 18: భువనగిరిలోని జిల్లా కోర్టు ప్రాంగణంలోకి వరద నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు మునిసిపాలిటీకి సూచించారు. ఈ మేరకు శనివారం మునిసిపల్ కమిషనర్ పి.రామాంజుల్‌రెడ్డితో కలిసి ఆయన కోర్టు ఆవరణను పరిశీలించారు. చిన్నపాటి వర్షానికే వరద, మురికి నీరు కోర్టు ప్రాంగణంలోకి చేరుతున్నదని కమిషనర్‌కు వివరించారు. దీంతో పరిసరాలను పరిశీలించగా కోర్టు ప్రాంగణం వెంట ఉన్న మురికి కాల్వలో వ్యర్థాలు పేరుకుపోవడంతోనే వరద నీరు కోర్టు ప్రాంగణంలోకి చేరుతున్నదని ప్రాథమికంగా గుర్తించారు. వెంటనే మురికి కాల్వలను శుభ్రం చేయడంతో పాటు వరద నీరు కోర్టులోకి రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బి.మాధవిలత, బి.నాగేశ్వర్‌రావు, మునిసిపల్ డీఈ కొండల్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డి.హరినాథ్, కె.కృష్ణ, తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

బొమ్మలరామారం, మే 18: ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడానికి, ఆర్థిక మోసాలను అరికట్టడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి శనివారం మండలంలోని తూముకుంట, రామలింగంపల్లి గ్రామాలలోని ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఎఫ్ఎల్ (సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్) కౌన్సిలర్స్ భానుశ్రీ, విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకుల నుంచి లావాదేవీలు నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకటేశ్, స్వరూప పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యా సంస్థలపై చర్యలు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

భువనగిరి అర్బన్, మే 18: జిల్లాలో పలు చోట్ల శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం బస్సులను ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాల్లో తిప్పుతున్న యాజమాన్యంపై కఠిన చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో శనివారం డీఈవో కే.నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను సంస్థ మోసం చేస్తోందన్నారు. ఇప్పటికే జిల్లాలోని భువనగిరి, మోత్కూర్, వలిగొండ ప్రాంతాల్లో ప్రారంభించగా వాటి నిర్మాణాలకు అనుమతులు ఇస్తే పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వేముల నాగరాజు, ఈర్ల రాహుల్, భవాని శంకర్ పాల్గొన్నారు.

కర్షలగడ్డతండావాసికి డాక్టరేట్

తుర్కపల్లి, మే 18: తుర్కపల్లి మంగడలం ధర్మారం పంచాయతీ పరిధిలోని కర్షలగడ్డ తండాకు చెందిన గిరిజన బిడ్డ జి.మంగుత్ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం హైద్రాబాద్‌లో అర్థశాస్త్ర విభాగంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.కృష్ణారెడ్డి పర్యవేక్షణలో 'జిల్లాలో వ్యవసాయంపై రైతు బంధు పథకం పై ప్రభావం' అనే అంశంపై 2017-18 నుంచి 2022-23 వరకు పరిశోధన చేశారు. ఆయన పరిశోధనను మూల్యాంకనం చేసిన అనంతరం విశ్వవిద్యాలయం వారు ఏర్పాటు చేసిన బోర్డ్ ఆఫ్ వైవా-వోస్ ద్వార పరిశీలన చేశారు. అనంతరం ఆయనకు పీహెచ్‌డీ పట్టా ఉత్తర్వులను విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ బి.శ్రీనివాస్ ఈ నెల 15న అందజేశారు. కాగా జి.మంగుత్ సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో అర్థశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

రైతన్నలు పచ్చిరొట్ట ఎరువులను వాడాలి

ఆలేరు రూరల్, మే 18: రైతన్నలు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులను వాడి అధిక ఉత్పత్తులను సాధించాలని ఏవో దీప్తి అన్నారు. శనివారం ఆలేరులో రైతులకు పచ్చిరొట్ట ఎరువులపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పచ్చిరొట్ట ఎరువులను వాడి నేల సారాన్ని పెంచాలన్నారు. తమ కార్యాలయంలో పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరమున్న రైతులు కొనుగోలు చేయాలని కోరారు.

దోపిడీ నుంచి ప్రజలను విముక్తి చేసేది కమ్యూనిస్టులే

ఆలేరు రూరల్, మే 18: ప్రస్తుత దోపిడీ వ్యవస్థను మార్చేది ప్రజలను దోపిడీ నుంచి విముక్తం చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.డేవిడ్‌కుమార్ అన్నారు. శనివారం ఆలేరులో అమరులైన జలగం జనార్ధన్, ఇక్కిరి ధర్మాలుకు ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రజా స్వామిక విప్లవం కోసం పోరాడి అమరులైన ప్రజా నాయకులు వారని కొనియాడారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్ధన్, నాయకులు రాజయ్య, సీత, సుదర్శన్, బాబు, రాఘవరెడ్డి, పాండరి పాల్గొన్నారు.